క్లుప్తంగా

మహాప్రస్థానం అభివృద్ధికి రూ.50 వేల విరాళం

తర్లుపాడు: తర్లుపాడులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి గ్రామానికి చెందిన కొలగట్ల గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి సంయుక్తంగా 50 వేల రూపాయల విరాళం అందించారు. మహాప్రస్థానం అభివృద్ధి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు జగన్‌బాబుకు ఆదివారం నగదు అందజేశారు. అలాగే నేస్తమా ఫౌండేషన్ సభ్యులు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకును అందించారు. దాతలకు మహాప్రస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్ర

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ నరేంద్ర పేర్కొన్నారు. మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పర్యవేక్షణలో పాఠశాల బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు అందజేశారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలని డాక్టర్ సూచించారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా చేసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పొట్టేలును రోడ్డుపైనే కోసి పడేసిన దృశ్యం


హైవే పక్కనే తోపుడు బండిపై మాంసం విక్రయాలు

ఎక్కడపడితే అక్కడ.. కోయ్.. కోయ్!

- మాంసం విక్రయాల్లో కానరాని శుభ్రత
- రోడ్లపైనే మటన్, చేపల విక్రయాలు
- తూకంపై వినియోగదారులకు సందేహాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కంభం:

మాంసం కావాలంటే మార్కెట్‌కు వెళ్లనక్కర్లేదు! రోడ్ల వెంట ఎక్కడ పడితే అక్కడ మాంసం కొనుగోలు చేయవచ్చు!! మాంసం విక్రయించాలంటే ఎవరి అనుమతీ అక్కర్లేదన్నట్టుగా ఉంది పరిస్థితి. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో రోడ్ల వెంట మాంసం విక్రయాలు సాగిస్తున్న తీరు.. అధికారుల ఉదాసీనతను ప్రశ్నిస్తోంది. మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటిస్తే ఎవరికీ అభ్యంతరం లేదు కానీ ఇష్టారీతిగా వ్యవహరిస్తుండటంతో నష్టపోవడం వినియోగదారుల వంతవుతోంది.

కంభం పట్టణంలో కూరగాయల మార్కెట్‌లో కొందరు మాంసం విక్రయిస్తుండగా, ఎక్కువ మంది కందులాపురం పంచాయతీ పరిధిలో అనంతపురం–అమరావతి జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మటన్, చేపల విక్రయాలు సాగిస్తున్నారు. మేకపోతులు, పొట్టేళ్లను హైవే పక్కనే కోసి, మట్టిలో పడేస్తున్నారు. ఆ తర్వాత తోలు తీసి ముక్కలు కొట్టి విక్రయిస్తున్నారు. అక్కడే


హైవే పక్కన నేలపైనే చేపల విక్రయాలు

తలకాయలు కాల్చి ముక్కలుగా నరుకుతున్న తీరుపై విమర్శలొస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

జీవాలను కోసే ముందు పంచాయతీ అధికారుల ధ్రువీకరణ తప్పనిసరి. అయితే కొందరు వ్యక్తులు రోగాల బారిన పడిన జీవాలను తెల్లారేసరికి కోసి సిద్ధంగా ఉంచుతున్నారు. దీంతో మాంసం నాణ్యత గుర్తించడం వినియోగదారులకు కష్టతరంగా మారింది. వ్యర్థాలు, మాంసాన్ని శుభ్రం చేసిన నీరు రోడ్డు పక్కనే ప్రవహిస్తుండటంతో స్థానికంగా నివాసం ఉంటున్న వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మాంసం తూకంపై వినియోగదారుల సందేహాలకు జవాబిచ్చే నాథుడు లేడు. తూనికల కొలతల శాఖల అధికారులు తూతూ మంత్రం తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

షాక్ కొట్టేలా మటన్ ధర!

రంజాన్ మాసం కావడంతో మాంసం విక్రయాలు ఊపందుకున్నాయి. బర్డ్ ఫ్లూ వదంతుల నేపథ్యంలో చికెన్ బదులు మటన్ కొనేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడ పడితే అక్కడ మటన్ విక్రయించే వారి సంఖ్య కూడా పెరిగింది. ఇదిలా ఉండగా పేద, మధ్య తరగతి ప్రజలకు మటన్ ధరలు షాకిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా కంభం పట్టణంలో కేజీ మటన్ రూ.900కు విక్రయిస్తున్నారు. డబ్బు ఎక్కువగా తీసుకుంటున్నారు కదా నాణ్యమైన మటన్ ఇస్తున్నారా అంటే అది కూడా లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

సర్కిల్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం

- దాతలను అభినందించిన ఎస్పీ దామోదర్

పొదిలి: భారత స్వాతంత్య్రానికి ఏడేళ్ల ముందు నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని పునర్నిర్మించి భావితరాలకు అందించడం అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. పొదిలిలో సుమారు 85 ఏళ్ల క్రితం నిర్మించగా శిథిలమైన పోలీస్ స్టేషన్ భవనాన్ని దాతల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆధునికీకరించిన ఈ భవనాన్ని ఆదివారం ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పొదిలి టౌన్‌లో చారిత్రాత్మక సంపదగా ఉన్న భవనాన్ని సర్కిల్ కార్యాలయంగా అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని గతంలో సీఐగా పనిచేసిన రాఘవేంద్ర సంకల్పించారని, ప్రస్తుత సీఐ వెంక


సర్కిల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

టేశ్వర్లు, ఎస్సై వేమన, కానిస్టేబుల్ అమీర్ దాతల సహకారంతో అది నేరవేరిందని పేర్కొన్నారు. సహాయ సహకారాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపి జ్ఞాపికలు అందజేశారు. కార్యాలయం నుంచి ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ.. శిలాఫలకం, జాతీయ జెండా ఆవిష్కరించారు.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

మహిళా పోలీసులకు ఎస్పీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ డెస్క్, జీజీహెచ్‌లో సఖి వన్ స్టాప్ సెంటర్, 1098పై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, యువతులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఏడో తేదీన జిల్లా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎనిమిదో తేదీన ర్యాలీ, సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఎస్సైలు వేమన, బ్రహ్మనాయుడు, రాజ్‌కుమార్, పలు సర్కిళ్ల సీఐలు, ఎస్సైలు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, డాక్టర్ యర్రం వెంకటరెడ్డి, జి.చెన్నారెడ్డి, వరికుంట్ల అనిల్, కామసాని రామిరెడ్డి, గునుపూడి భాస్కర్, బెల్లంకొండ విజయలక్ష్మి, వరికూటి శిరీష తదితరులు పాల్గొన్నారు.


దాతలతో ఎస్పీ దామోదర్

కోలాటం చిందు.. కనుల విందు


కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగింది. సంప్రదాయ పద్ధతులను అవలంబిస్తూ గ్రామ వీధుల్లో ప్రదర్శించిన కోలాటం ప్రజలను అలరించింది. గ్రామంలోని భవాని శంకరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఇటు రాకండి.. అటే పోండి..!

పాములపల్లె రైల్వే గేటు వద్ద రోడ్డు మూత
- రైల్వే శాఖ తీరుతో స్థానికులకు తిప్పలు


రోడ్డుకు అడ్డంగా పాతిన ఇనుప కమ్మీలను దాటుతున్న మహిళలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాములపల్లె గేటు వద్ద నుంచి రాచర్ల రైల్వే గేటుకు అనుసంధానంగా ఉన్న రోడ్డును రైల్వే అధికారులు మూతవేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రైల్వే లైన్ డబ్లింగ్ పనుల్లో భాగంగా పాములపల్లె గేటు నుంచి రాచర్ల గేటు వరకు ఉన్న గృహాలను తొలగించి నూతనంగా రోడ్డు నిర్మించారు. స్థానికులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించడానికి రైల్వే అధికారులు సమ్మతించలేదు. తాము నిర్మించిన రోడ్డులో రాకపోకలు నిషిద్ధమంటూ ఆ రోడ్డుకు ఇరువైపులా ఇనుప కమ్మీలను పాతారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా, పాదచారులు మాత్రం కమ్మీలను దాటి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రహదారిని వినియోగించుకునేలా ఇనుప కమ్మీలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉగాది ఉత్సవాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండగకు ముందు 4 ఆదివారాల్లో అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవ రెడ్డి, సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు. ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు.


ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు


గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ

- డీఈఓ కిరణ్‌కుమార్

కొనకనమిట్ల: పదో తరగతికి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను బాగా చదివించి ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పై చదువులకు వెళ్లాలంటే పదో తరగతి కీలకమనే విషయాన్ని విద్యార్థులు గ్రహించి, అందుకు అనుగుణంగా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, సబ్జెక్టుల్లో సందేహాలను అర్థమయ్యేలా నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. డీఈఓ వెంట డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు, స్థానిక ఉపాధ్యాయులు ఉన్నారు.

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల మోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదివారం డీఈఓ కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం తెలుగు స్టడీ అవర్స్ నిర్వహిస్తుండగా డీఈఓ పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎంతో కీలకమని, ఇష్టంతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.


ఆముదాలపల్లి దాటిన తర్వాత ప్రమాదకరంగా రోడ్డు మలుపు


బుచ్చనపాలెం సమీపంలో..

ప్రమాదాల ముప్పు.. ఏదీ కనువిప్పు?

- ప్రమాదాలకు నిలయంగా రహదారి మలుపులు
- సూచిక బోర్డుల ఏర్పాటుపై శ్రద్ధ చూపని అధికారులు

పొదిలి రూరల్: పొదిలి–దర్శి రోడ్డులో మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దాదాపు 15 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారిలో బుచ్చనపాలెం ఎస్సీ కాలనీ, కొత్తపల్లి, నిమ్మవరం, తీగదుర్తిపాడు, ఆముదాలపల్లి గ్రామాల సమీపంలో ఉన్న మూల మలుపుల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మలుపులను ముందుగానే గుర్తించే విధంగా సూచిక బోర్డులు లేకపోవడంతో ఊహించని రీతిలో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నిమ్మవరం సమీపంలో..


ఎస్సీ కాలనీ తర్వాత సూచిక బోర్డులు లేని మలుపు